క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్‌కుమార్‌రెడ్డి కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ అండ్ యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర సమస్యలు, పోస్టేట్ గ్రంథి సమస్యలు, అంగ సమస్యలు, చిన్నపిల్లల అంగం, చిన్న పిల్లల గజ్జల్లో వాపు, బీజము సమస్యలు, సెక్స్ సమస్యలు, పిల్లలు పుట్టకపోవడం తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

3న పింఛన్ల పంపిణీ

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్ డబ్బులను జనవరి 3వ తేదీన లబ్ధిదారులకు పండుగలా పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. ప్రతినెలా 1వ తేదీన పంపిణీ చేసే పింఛన్ల పంపిణీ.. ప్రభుత్వం పింఛన్‌దారులకు రూ.3 వేలు పెంచిన నేపథ్యంలో జనవరి 3వ తేదీన పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి పింఛన్ లబ్ధిదారులు సహకరించాలన్నారు.

5న కొండాపురంలో..

కొండాపురం : రాష్ట్ర ప్రభుత్వం రూ.2750 నుంచి రూ.3 వేలకు పింఛన్ డబ్బులను పెంచడంతో పాటు నూతనంగా పింఛన్లు లబ్ధిదారులకు మంజూరైనట్లు ఎంపీడీఓ నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలో 3వ తేదీ నుంచి కొత్త పింఛన్లతో పాటు రూ.3 వేలు చేయడంతో మండలాల వారిగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తారన్నారు. కొండాపురం మండలంలో ఎమ్మెల్యే 5వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు.


నేడు పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు

జమ్మలమడుగు : స్థానిక ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు దేవదానం, పొన్నారి దస్తగిరిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఆర్డీఓ జి.శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మలు హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పెన్షనర్స్ అందరు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : స్థానిక సరస్వతీ నగర్‌లో రూ.45 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు భూమి పూజ చేయడానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆదివారం రానున్నారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. మండల నాయకులు, వైఎస్సార్‌సీపీ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని వారు తెలిపారు.

కొనసాగుతున్న ఆడుదాం.. ఆంధ్ర క్రీడలు


పోటీలను పరిశీలిస్తున్న కమిషనర్

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్నాయి. శనివారం మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ ఈ క్రీడా పోటీలను పరిశీలించారు.

రేపు కల్యాణ మహోత్సవం

వేంపల్లె : లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బి.ఎర్రగుడి గ్రామంలో వెలసిన శ్రీఓబులేసుస్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వేంపల్లె శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్, మానవత స్వచ్ఛంద సంస్థ మండల చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి తెలిపారు. టీటీడీ దేవస్థానం నుంచి ఆగమ పండితులు అశోకాచార్యులు, మోహన్‌కృష్ణల బృందంచే అభిషేకాలు, అలంకరణలు ఉంటాయన్నారు. చెక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు ముగ్గుల పోటీ

కడప కల్చరల్ : కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాలు 2024లో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నగర పరిధి ఎర్రముక్కపల్లెలోని శివశివానీ స్కూలు మైదానంలో స్త్రీలకు ముగ్గుల పోటీ నిర్వహిస్తామన్నారు. గంట సమయంలో 4.5 అడుగుల పొడవు, వెడల్పులో ముగ్గు వేయాల్సి ఉంటుందన్నారు. విజేతలకు రూ.10,000, రూ.7500, రూ.5000తోపాటు ఐదుగురికి చీరలను బహుమతిగా ఇవ్వనున్నట్లు వివరించారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ


నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని రింగ్‌రోడ్డు వైపు నుంచి పబ్బాపురం మధ్యలో వున్న వాగుపై నిర్మించే నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. గతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పబ్బాపురం పంచాయతీలో పర్యటించినప్పుడు పంచాయతీ ప్రజలు రింగ్ రోడ్డు వైపు నుంచి పబ్బాపురం గ్రామానికి వచ్చేందుకు వాగు అధికంగా ప్రవహించిన సమయంలో అన్ని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని ఆయనకు వివరించారు. స్పందించిన ఆయన ఎంపీ నిధుల కింద రూ.56 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుభిక్ష పాలన సాగుతున్నదని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి నెరవేరుస్తూ ముందుకు సాగుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన మాట ప్రకారం కుల మత పార్టీలకు అతీతంగా ప్రతి వర్గానికి మేలు జరిగే విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించారన్నారు. రాబోవు ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు కుయుక్తులు చేసిన ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కడతారన్నారు. నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, సర్పంచ్ సగిలి లక్ష్మీదేవి, సగిలి గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీ సగిలి నారాయణరెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, రఘురామిరెడ్డి, చిన్నసుబ్బరాయుడు, పెద్ద సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట.. పథకాల పంట

ఎర్రగుంట్ల : నవరత్న పథకాలతో పేదల ఇంట పథకాల పంట పండుతోందని పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిలంకూరు గ్రామంలో శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని అక్కడున్న అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసినందువల్లే ధైర్యంగా వారి ముందుకు వెళ్లి అభివృద్ధిని వివరిస్తున్నామన్నారు. చిలంకూరు గ్రామంలో కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రభుత్వంలో అర్హత కలిగిన ఏ ఒక్కరూ ప్రభుత్వ ఫలాలు అందలేదనకూడదన్నారు. ప్రజలు రానున్న కాలంలో ఈ ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి రఘునందన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్



పులివెందుల : పట్టణంలో, గ్రామాల్లో ఈనెల 31వ తేదీన అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు పులివెందుల ప్రాంత ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, శాంతి భద్రతలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా ఎవరి ఇంట్లో వారు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఎటువంటి డీజేఈలకు అనుమతి లేదని.. బాణా సంచా కాల్చడం, ఇతరులకు ఇబ్బంది పెట్టడం చేయరాదన్నారు. ఈనెల 30, 31వ తేదీలలో రాత్రి ముమ్మరంగా వాహనాల తనిఖీ ఉంటుందని.. అలాగే మద్యం సేవించి వాహనం నడపడం కానీ, మోటార్ సైకిళ్లపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించడం చేయరాదన్నారు. జాతీయ రహదారులు, ఇతర రోడ్లపై బైకు రేసులు పూర్తిగా నిషేధించడం జరిగిందని.. అటువంటి వాటిపై నిఘా ఉంటుందని.. అలా చేసిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పోలీసు సిబ్బందిచే ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అలాగే నూతన సంవత్సరం సందర్భంగా వీధులలో, రోడ్లపై ఎటువంటి కేక్ కటింగ్ కార్యక్రమాలకు అనుమతిలేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంవరకు మాత్రమే బార్లు, హోటళ్లు, రెస్టారెంట్ల వారికి అనుమతి ఉంటుంది తప్ప.. ఎవరికి ఎటువంటి ప్రత్యేక అనుమతులు ఉండవన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాలలో నిర్వహించేందుకు అనుమతిలేదన్నారు. అలాగే సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, అసభ్యకరమైన అంశాల పోస్టులు చేయరాదన్నారు. అలాగే ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను తీసి అధిక శబ్దాలతో రోడ్లపై నడిపే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కాలనీల్లో వీధి దీపాలు ధ్వంసం చేయడం కానీ, ప్రభుత్వ సంస్థల ఆస్తులకు నష్టం కలిగించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్‌సీఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్‌లు

పులివెందుల టౌన్ : స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో శనివారం సాయంత్రం రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందిన నూతన సంవత్సర క్యాలెండర్లను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌సీడీఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి అన్నం పెట్టేవాడు రెడ్డి అని, సమాజంలోని అన్ని వర్గాలను ఆదుకునే రెడ్డి ఐక్యత, అన్ని వర్గాలకు ఎంతో ఉపయోగపడుతుందని, ప్రస్తుతం భారతదేశంలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఇద్దరు రెడ్లు ముఖ్యమంత్రులుగా ఉండటం అరుదైన, చిరస్మరణీయమైన విషయమన్నారు. పేద, అనాథ అనారోగ్య సమస్యలలో ఉన్న వారికి, పేద రెడ్డి విద్యార్థుల సంక్షేమం కోసమే కాకుండా ఇతర కులాల్లో ఉన్న పేద వారికి కూడా సాయం చేసేందుకు ఇతర సోదర కుల సంఘాలతో కలిసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, నూర్‌బాషా కార్పొరేషన్ చైర్మన్ ఓతూరు రసూల్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రఘునాథరెడ్డి, ఆర్‌సీడీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడు అందరి వాడు


అయోధ్య రాముని అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

వేంపల్లె : శ్రీరాముడు అందరివాడు.. సకలగుణాభి రాముడు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలో ఉన్న హనుమాన్ జంక్షన్ వద్ద నుంచి హిందువులందరూ తలపై అక్షింతలు పెట్టుకుని పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని జనవరి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని.. ప్రతి ఇంటికి శ్రీరాముని అక్షింతలు చేరాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక పూజలు

కొండాపురం : స్థానిక సరస్వతి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టులో పూర్తి నీటిమట్టం నిల్వ చేయడంతో సరస్వతి దేవాలయం మునిగిపోయింది. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గడంతో సరస్వతి దేవాలయం చుట్టు నీళ్లు లేకపోవడంతో ఆలయంలో అభిషేకాలు ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గోరుముద్ద పథకంతో రుచికరమైన భోజనం


గోరుముద్ద పథకంను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌ఎస్ షాహిద్

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో విద్యార్థుల కోసం రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గోరుముద్ద పథకం వల్ల విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతుందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆర్‌ఎస్ షాహిద్ తెలిపారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం వారు గోరుముద్ద పథకంను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ కోసం రాష్ట్ర సీఎం ప్రత్యేక చొరవ చూపి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. తర్వాత విద్యార్థులతో మాట్లాడి అక్కడే భోజనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బోరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ అబ్దుల్ ఖాదర్, మండల కన్వీనర్ రుద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 2023 జూలై నుంచి వర్తించే విధంగా మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ వేతన సవరణ సంఘం కమిషన్ ఏర్పాటు చేసినా, ఇంత వరకు బాధ్యతలు చేపట్టలేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ త్వరగా వచ్చే అవకాశం ఉంది కాబట్టి వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఖాదర్‌బాషా, శ్రీనివాసులరెడ్డి, గురయ్య, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, సుబ్బయ్య, జిల్లా కౌన్సిలర్ మణికుమార్, పూర్వ అధ్యక్షుడు చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు నూతన సంవత్సర సంబరాలు


నూతన సంవత్సర వేడుకలలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు


విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయుడు నాగేంద్ర

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంబరాలు ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలతో ఆటల పాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఏడాదిలో ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీలు చేతన్‌రెడ్డి, చైతన్యారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : మండల పరిధిలోని కోవరంగుంటపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హెడ్మాస్టర్ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు అంగడి నాగేంద్ర విద్యార్థుల సమక్షంలో నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో విద్యార్థులు ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలకు స్పోర్ట్స్ కిట్స్ వితరణ


కళాశాలకు స్పోర్ట్స్ కిట్లను అందిస్తున్న కళాశాల ఎండీ చంద్రశేఖర్

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు శనివారం బెంగుళూరు శ్రీస్కంద ఇంజనీరింగ్ కళాశాల ఎండీ జె.చంద్రశేఖర్ రూ.25వేలు విలువ చేసే టేబుల్ టెన్నిస్ బాల్, బ్యాట్స్, 4 వాలీబాల్స్, 3 జావెలిన్ స్టిక్స్, 2 డిస్కస్ త్రో స్పోర్ట్స్ కిట్లతోపాటు 2 ఎయిర్ పంప్‌లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తాతాజీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి ప్రవర్తనతో జీవించాలి


మాట్లాడుతున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు : జైలు నుంచి బయటికి వెళ్లిన తర్వాత మంచి ప్రవర్తనతో జీవించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. శనివారం ఆమె సబ్‌జైలులో ఉన్న ఖైదీలను కలిసి వారికి సంబంధించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఖైదీలకు ఎవరికైనా న్యాయం కావాలంటే న్యాయ సలహాదారులను కలవచ్చు అని సూచించారు. ఖైదీలు భవిష్యత్తులో మరో తప్పు చేయకుండా ఉండాలన్నారు. మీరు ఖైదీలుగా జైలులో ఉండటం వల్ల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవలసి వస్తుందన్నారు. కాబట్టి తమ పిల్లల భవిష్యత్తు కోసం పని చేసి వారికి మంచి చదువులను చదివించుకోవాలన్నారు.

సేవ్ ద గర్ల్ చైల్డ్‌పై వ్యాసరచన పోటీలు


విజేతలుగా నిలిచిన విద్యార్థినులతో పాఠశాల ఉపాధ్యాయులు

వేంపల్లె : సేవ్ ద గర్ల్ చైల్డ్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం సి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక మెమెంటోను ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారికి బహుమతులను అందించారు. విద్యార్థులందరూ ఇలాంటి పోటీలలో పాల్గొని తమ ప్రతిభను మెరుగుపరిచి జిల్లాస్థాయిలో మొదటిస్థానం కై వసం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని నాల్గవ వార్డులో రూ.12 లక్షలతో వేస్తున్న సిమెంట్ రోడ్డు పనులకు శనివారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి భూమిపూజ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని అభివృద్ధి పనులు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగానే నాల్గవ రోడ్డులో కూడా ప్రజల కోరిన మేరకు ఈ సీసీ రోడ్డు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్, పార్టీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

కమలాపురం : తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం స్పందించి తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శనివారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి వారు సమ్మె విరమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయండి

పులివెందుల రూరల్ : డ్వాక్రా సంఘాల మహిళలు బలోపేతమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక పాత బస్టాండు సమీపంలో ఉన్న మెప్మా కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది తన కాళ్లమీద నిలబడి చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు తక్కువ ధరలకే నిత్యావసర సరుకులు అందించే విధంగా జగనన్న మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు.

జగనన్న మహిళా మార్ట్‌కు మహిళలే యజమానులన్నారు. బయట మార్కెట్ కంటే తక్కువ ధరలకే జగనన్న మహిళా మార్ట్‌లో నిత్యావసర సరుకులు లభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎంలు రాజేశ్వరి, మెప్మా సీఓలు నాయుడు, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పులివెందుల టౌన్ : స్థానిక నూతన ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం పునఃనిర్మాణానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.80 లక్షల ప్రభుత్వ నిధులతోపాటు రూ.20 లక్షల భక్తుల సహకారంతో దేవాదాయ, ధర్మదాయ శాఖల ఆధ్వర్యంలో ఆలయ పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆంజనేయస్వామి గర్భాలయంలోని విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో కొలువు తీర్చారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు రామ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించి ఆలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ డీఈ గంగయ్య, హిందు ధర్మప్రచార సమితి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను అందిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి


వేంపల్లెలో దివ్యాంగుడికి ట్రై సైకిల్‌ను అందిస్తున్న మునీర్‌బాషా

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని సీఎం క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు శనివారం సాయంత్రం ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పంపిణీ చేశారు. ఇటీవల వార్డు పర్యటనలో భాగంగా దివ్యాంగుల ద్వారా వచ్చిన ఫిర్యాదులను వలంటీర్లు స్వీకరించి వారికి అవసరమైన ట్రై సైకిళ్ల విషయాన్ని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సొంత నిధులతో ఆరు మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులపట్ల కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని వారికి అవసరమైన సదుపాయాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ రాజశేఖర్, మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోటంశెట్టి హరి, దివ్యాంగులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : వికలాంగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగ నిలుస్తోందని హజ్‌హౌస్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మునీర్‌బాషా తెలిపారు. శనివారం వేంపల్లెలో నివాసముంటున్న షేక్ సత్తార్ అనే వికలాంగుడికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆర్థిక సాయంతో ఇచ్చిన బ్యాటరీ సైకిల్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల సంక్షేమాభివృద్ధికి వైఎస్ రాజశేఖరరెడ్డి 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అలాగే ఆయన తనయుడ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారన్నారు.

అలాగే పట్టణంలో ముస్లింలకు ప్రత్యేకంగా జూనియర్ కళాశాలను మంజూరు చేయించారన్నారు. ముస్లింలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూఘర్ షాదీఖానా కమిటీ చైర్మన్ బీఎస్ షేక్షావల్లి, మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిస్సార్ బాషా, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.